

మైనార్టీల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం : ఎంపీ



ఎంపీ మిథున్‌రెడ్డిని సన్మానిస్తున్న మైనార్టీ నాయకులు

వాల్మీకిపురం: రాష్ట్రంలోని మైనార్టీల అభివృద్ధి సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డితోనే సాధ్యమని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తిరుపతిలోని ఎంపీ మిథున్‌రెడ్డి స్వగృహంలో పట్టణంలోని మైనార్టీ నాయకులు కలుసుకొని, పుష్పగుచ్ఛం అందించి, దుశ్శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా మైనార్టీలు మాట్లాడుతూ మైనార్టీల అభివృద్ధికి, మసీదులు, పీర్లచావడి అభివృద్ధికి నిధులు కేటాయించాలన్నారు. అనంతరం ఎంపీ మిథున్‌రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డితో చర్చించి, త్వరలోనే చర్యలు తీసుకుంటామన్నారు. నియోజకవర్గంలో ఎప్పుడూ లేని విధంగా ముస్లింల అభివృద్ధి కోసం నిధులు కేటాయించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీలు సాధిక్, ఇర్ఫాన్, అషర్, షాహెద్, మహబూబ్‌బాషా, సందానిబాషా, మహమ్మద్ అలి, జబ్బార్, ఖాజాపీర్, గఫ్పార్, జాకీర్, రషీద్ పాల్గొన్నారు.

వైసిపి పాలనలో దళితులకు రక్షణ కరువు

- పాదయాత్రలో నారా లోకేష్



యువగళం పాదయాత్రలో లోకేష్‌కు హారతులు పడుతున్న మహిళలు

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు పుట్టపర్తిసర్కిల్/చాపాడు

వైసిపి పాలనలో దళితుల ప్రాణాలకు, ఆస్తులకు, భూములకు రక్షణ కరువైందనిటిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. యువగళం పేరుతో లోకేష్ చేపట్టిన పాదయాత్ర 114వ రోజుకు చేరుకుంది. శుక్రవారం ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని కొత్తపల్లి విడిది కేంద్రం నుంచి పాదయాత్ర ప్రారంభమై మైదుకూరు నియోజకవర్గంలోకి ప్రవేశించింది. నాగులాపల్లి క్రాస్, ఖాదర్‌పల్లి, చాపాడు, సీతారాంపురం క్రాస్, చియ్యపాడు క్రాస్, అల్లాడుపల్లె దేవలాలు, కేతవరం, పుల్లయ్య సత్రం, విశ్వనాథపురం విడిది కేంద్రం వరకూ పాదయాత్ర సాగింది. ఆయా ప్రాంతాల్లో స్థానికులు, దళితులు, రైతులతో ముఖాముఖి, మాటామంతి, సమావేశాలు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. పాదయాత్ర సందర్భంగా పలుచోట్ల లోకేష్ మాట్లాడుతూ దళితుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన జగన్మోహన్‌రెడ్డి వారిపైనే ఉక్కుపాదం మోపుతూ తీవ్ర అణచివేత చర్యలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. దళితులకు చెందిన 12 వేల ఎకరాల అసైన్డ్ భూములను లాక్కున్నారన్నారు. రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా గత నాలుగేళ్లలో దళితుల వద్ద ఉన్న భూమి విస్తీర్ణం తగ్గిపోయిందని తెలిపారు. ఎస్సీలకు చెందాల్సిన సబ్ ప్లాన్ నిధులు రూ.28,147 కోట్లు దారిమళ్లించారని తెలిపారు. 27 సంక్షేమ పథకాలు రద్దు చేశారన్నారు. ముఖ్యమంత్రి జగన్ అండ్‌కోకు ఇసుక, మట్టి అమ్మకాలపై ఉన్న శ్రద్ధ ప్రాజెక్టులపై లేదన్నారు. నాలుగేళ్లలో బినామీ సంస్థను అడ్డంపెట్టుకొని ఇసుక ద్వారా జగన్ రూ.10 వేల కోట్లు దోచుకున్నారని విమర్శించారు. జగన్ ధనదాహం కారణంగా అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయి 61 మంది అమాయకులు బలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల పక్షాన నిలవాల్సిన అధికారులు వైసిపి తొత్తులుగా మారడం దురదష్టకరమని తెలిపారు. జగన్ పాలనలో అన్ని రంగాల వారు బాధితులేనన్నారు. సొంత జిల్లా కడప, సొంత నియోజకవర్గం పులివెందులకి ఏం చేశాడో జగన్ చెప్పగలడా? అని ప్రశ్నించారు. ఉమ్మడి కడప జిల్లాలో 10 కి 10 సీట్లు ఇస్తే జగన్ చేసింది ఎంటన్నారు. దొంగ చేతికి తాళం ఇస్తే ఎం జరిగింది? అందరూ దోపిడీకి గురయ్యారని విమర్శించారు. లాయర్లు, డాక్టర్లు, వ్యాపారస్తులు, టీచర్లు, ఐటి నిపుణులు అందరూ జగన్ చేతిలో బాధితులేనని, వీరి విపరీతంగా జగన్ వేధిస్తున్నారని తెలిపారు. జగన్ పాలనలో ఎపి బీహార్‌తో పోటీ పడుతోందన్నారు. ప్రస్తుతానికి షాపులు, వ్యాపారాల మీద దాడి చేస్తున్నారనీ, మరో సారి ఓటేస్తే జగన్ అండ్ కో ఇంటికొచ్చి దోచుకుంటారని తెలిపారు. టిడిపి హయాంలో న్యాయ విభాగానికి నిధులు కేటాయించి కొత్త భవనాలు, లైబ్రరీలు కట్టించడానికి పనులు ప్రారంభించామని, ఈ ప్రభుత్వం ఆ పనులు నిలిపివేసిందన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే అడ్వకేట్ల రక్షణ కోసం ప్రత్యేక చట్టం తెస్తామన్నారు. మౌలిక వసతుల కల్పన కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తామని తెలిపారు. జగన్ వేధింపుల వలన అన్ని కంపెనీలు ఇతర రాష్ట్రాలకు పారిపోతున్నాయన్నారు. జగన్ వేదింపులు, జే ట్యాక్స్ కట్టలేక కంపెనీలు అన్ని ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోతున్నాయని తెలిపారు. అమర్‌రాజా, ఫాక్స్ కాన్, రిలయన్స్ లాంటి సంస్థలు వేరే రాష్ట్రాలకు వెళ్లి పోయాయని తెలిపారు. టిడిపి ప్రభుత్వం వచ్చిన వెంటనే మ్యానిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చి ఆ వ్యత్యాసాన్ని తగ్గిస్తామని పేర్కొన్నారు. పాదయాత్రలో మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి, టిడిపి కడప జిల్లా అధ్యక్షులు లింగారెడ్డి, ప్రొద్దుటూరు, మైదుకూరు నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, పుట్టా సుధాకర్‌యాదవ్ పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనతోనే జిల్లా అభివృద్ధి : గిరీష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లా ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే పరిశ్రమల స్థాపన విరివిగా జరగాలని కలెక్టర్ గిరీష అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ విసి హాల్లో జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే వారికి అవసరమైన ప్రోత్సాహం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చే వారికి సత్వరమే అనుమతులను ఇచ్చేవిధంగా కృషి చేయాలన్నారు. పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చే వారికి బ్యాంకర్లు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పరిశ్రమల స్థాపన కోసం వచ్చిన దరఖాస్తులు ఏ శాఖ వద్దా పెండింగ్ ఉండకూడదని, నిర్ణీత కాలవ్యవధిలో వాటిని అనుమతించాలని స్పష్టం చేశారు. నిర్దేశిత లక్ష్యాల మేరకు బ్యాంకర్లు రుణాలు మంజూరు చేయాలని ఆదేశించారు. పిఎంఇజిపి కింద ముందుకు వచ్చే వారికి రుణాలు ఇచ్చేలా చూడాలన్నారు. కొత్త పరిశ్రమ స్థాపన వల్ల జిల్లాకు టాక్స్‌ల ద్వారా వచ్చే రాబడి, కలిగే ఉపాధి, పెట్టుబడి, ఎగుమతి, దిగుమతి వంటి అంశాలను అధికారులు నిశితంగా పరిశీలించాలన్నారు. రిమార్కులు ఏమైనా వుంటే వెంటనే వాటి జాబితాలు సిద్ధం చేయాలన్నారు. లబ్ధిదారులకు కేంద్ర ప్రభుత్వం నిర్వహించే సర్వేలో ఫీడ్ బ్యాక్ విషయమై అవగాహన కల్పించాలన్నారు. సింగల్ డెస్క్ పోర్టల్‌లో మొత్తం అప్లికేషన్‌లు 1503 వచ్చాయని, 1448 దరఖాస్తులు అప్రూవ్ అయ్యాయన్నారు. ఇంకా 9 దరఖాస్తులు పెండింగ్లో ఉన్నాయన్నారు. జగనన్న బడుగు వికాసం కింద 17 దరఖాస్తులను అప్రూవల్ చేయడం జరిగిందన్నారు. ఐడిపి పావలా వడ్డీ స్కీం కింద రెండు దరఖాస్తులను అప్రూవల్ ఇచ్చారు. పవర్ కాస్ట్ ఐడిపి కింద మూడు దరఖాస్తులను అప్రూవల్ ఇచ్చారు. సుమారు 14 దరఖాస్తులను వివిధ కారణాల రీత్యా రిజెక్ట్ చేశామన్నారు. పిఎంఇజిపి పథకంలో మొత్తం 243 దరఖాస్తుల రాగ 80 శాంక్షన్ అయ్యాయని, 141 దరఖాస్తులు పెండింగ్లో ఉన్నాయన్నారు. పిఎంఇజిపి పథకం కింద ఆవుల రుణాలు విరివిగా ఇచ్చేందుకు బ్యాంకర్లు కృషి చేయాలన్నారు. సమావేశంలో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ జె.నాగరాజ, ఎపిఐఐసి జెడ్ఎం మూర్తి, ఎల్‌డిఎం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి పెద్దపీట

వైఎస్ఆర్ యంత్రసేవ పథకం ప్రారంభంలో కలెక్టర్ గిరీష, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి



రైతులకు మెగా చెక్‌ను అందజేస్తున్న కలెక్టర్ గిరీష, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వైఎస్ఆర్ యాంత్రీకరణ వ్యవసాయ సేవలతో రైతన్నలకు పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయని కలెక్టర్ గిరీష పేర్కొన్నారు. శుక్రవారం రాయచోటి కలెక్టరేట్ ఆవరణలో జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వైఎస్ఆర్ యంత్ర సేవా పథకం మెగా మేళా-2 కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గిరీష మాట్లాడుతూ నేడు వ్యవసాయ సాగు రంగంలో అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయని, పోటీ తత్వం పెరుగుతోందని, వీటిని అందిపుచ్చుకుని వ్యవసాయంలో రైతులు లాభాల బాట పట్టేలా ప్రభుత్వం చేయూతనిస్తోందని చెప్పారు. వైఎస్ఆర్ యంత్ర సేవా పథకాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందన్నారు. జిల్లాలో 161 సిహెచ్‌సి గ్రూపులకు రూ. 11.385 కోట్ల ఖర్చుతో రూ.3.836 కోట్ల రాయితీపై 100 ట్రాక్టర్లు, 370 వ్యవసాయ పరికరాలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం రైతన్నకు వెన్నుదన్నుగా నిలవడంతోపాటు ఆర్‌బి.కెల పరిధిలో 10, 15 మంది రైతులతో గ్రూపులు ఏర్పాటు చేసి యంత్ర సేవా కేంద్రాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. రైతులు ఒక బాధ్యతగా వ్యవసాయంపై శ్రద్ధ పెట్టి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను అందిపుచ్చుకొని ఆర్థికంగా ఎదగాలని పేర్కొన్నారు. ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ మనది రైతు పక్షపాత ప్రభుత్వమని రైతులకు ఉపయోగపడే అనేక కార్యక్రమాలను జగనన్న ప్రభుత్వం అమలు చేస్తోందిన్నారు. ప్రస్తుతం వ్యవసాయ కూలీలు దొరికే పరిస్థితి లేదన్నారు. రైతు యంత్రాలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఉందని చెప్పారు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకున్న ముఖ్యమంత్రి వ్యవసాయంలో పెట్టుబడి ఖర్చులు తగ్గించడానికి యంత్ర సేవా పథకాన్ని పటిష్టంగా అమలు చేస్తున్నారన్నారు. వ్యవసాయ, ఉద్యాన రంగాలకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తోందని చెప్పారు. డ్రిప్పు, చాప్ కట్టర్లు, హార్వెస్టింగ్ యంత్రాలు తదితరాలను రాయితీతో ప్రభుత్వం అందిస్తోందిన్నారు. ప్రభుత్వం రైతన్నలకు అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులు, ప్రజల కోసం అనునిత్యం కృషిచేస్తున్న ప్రభుత్వంపై ప్రతిపక్షం బురద జల్లుడం సమంజసం కాదన్నారు. ఇతరుల మ్యానిఫెస్టో లును కాపీ చేయడంలో చంద్రబాబు దిట్ట అని అన్నారు. అనంతరం పథకంలో భాగంగా జిల్లాలోని 161 సిహెచ్‌సి గ్రూపులకు సంబంధించి రూ.11.385 కోట్ల ఖర్చుతో 100 ట్రాక్టర్లు, 370 వ్యవసాయ పరికరాలను లబ్ధిదారులకు కలెక్టర్, ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. అలాగే ప్రభుత్వం మంజూరు చేసిన రాయితీ రూ 3.836 కోట్ల మెగా చెక్కును లబ్ధిదారులకు ముఖ్య అతిథులు అందజేశారు. కార్యక్రమంలో డిసిఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్ రెడ్డి, లక్కిరెడ్డిపల్లె ఎంపిపి సుదర్శన్ రెడ్డి, వ్యవసాయ శాఖ జెడి ఉమామహేశ్వరమ్మ, ఎడిఎ లక్ష్మి సువర్ణ, వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు ట్రిపుల్‌ఐటిల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల



ప్రజాశక్తి - వేంపల్లె

ఆంధ్రప్రదేశ్ రాజీవ్‌గాంధీ విజ్ఞాన, సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్‌జెయుకెటి) ఆధ్వర్యంలో 2023-24 విద్యాసంవత్సరానికి ట్రిపుల్ ఐటిలలో ప్రవేశాలకు ఈనెల 3న విడుదల చేయనున్నట్లు ఆర్‌జెయుకెటి అధికారులు తెలిపారు. ఈనెల 4 నుంచి 26న 5గంటల వరకు ఏదైనా ఎపి ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా అడ్మిషన్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు అన్నారు. ప్రత్యేక కేటగిరీ వికలాంగ, ఎన్‌సిసి, స్పోర్ట్స్‌కు చెందిన విద్యార్థులకు జులై 5 నుంచి 9 వరకు నూజివీడు క్యాంపస్‌లో సర్టిఫికెట్లు పరిశీలన ఉంటు oదన్నారు. విద్యార్థులకు సీటు కేటాయించే ఫలితాలు జులై13 ప్రకటి స్తారని తెలిపారు. ట్రిపుల్ ఐటీల్లో సీట్లు పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లను జులై 3వ వారంలో అయా క్యాంపస్‌ల్లో ఉంటాయని పేర్కొన్నారు. తరగతులు ఆగస్టు 1వ వారంలో ప్రారంభమవుతున్నట్లు అధికారులు తెలి పారు. ఆన్‌లైన్‌లో పదోతరగతి పాస్ అయిన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. 2022-23 విద్యాసంవత్సరానికి, గవర్నింగ్ కౌన్సిల్ సిఫారసు మేరకు ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు 4 శాతం డిప్రివేషన్ జోడించి 10వ తరగతి మెరిట్ ఆధారంగా అడ్మిషన్లు నిర్వహి స్తారని తెలిపారు. ఎపిఆర్‌జెయుకెటి పరిధిలోని నాలుగు ట్రిపుల్ ఐటీలో క్యాంపస్‌లలో ప్రవేశాలకు ప్రతి ఏడాదీ మూడు సార్లు విద్యార్థులకు కౌన్సెలింగ్‌కు పిలుస్తారని, అధికారిక వెబ్‌సైట్ నుంచి కాల్ లెటర్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఆయా తేదీల్లో కౌన్సెలింగ్‌కు హాజరుకావల్సి ఉంటుందని తెలిపారు. సీట్లు పొందిన విద్యార్థులకు రెండేళ్ల పియుసి, నాలుగేళ్ల బిటెక్ కోర్సుతో కలిపి మొత్తం ఆరేళ్ల కోర్సులో ప్రవేశాలు పొందుతారన్నారు. ఎపిలో ఉన్న ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళం, నూజివీడు ట్రిపుల్ ఐటి క్యాంపస్ ల్లో 4000 వేల సీట్లు ఉన్నాయని తెలిపారు. ప్రతి క్యాంపస్‌కు 1000 సీట్లు కేటాయించారని, అలాగే ఈడబ్ల్యుఎస్ అభ్యర్థులకు 10 శాతం, అలాగే ప్రతి క్యాంపస్‌కు అదనంగా 100 సూపర్ న్యూమరీ సీట్లు ఉన్నాయన్నారు. ఇందులో 85 శాతం సీట్లు ఆంధ్రప్రదేశ్ అభ్యర్థులకు, 15శాతం ఓపెన్ మెరిట్ (ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రెండింటికీ) రిజర్వ్ చేయబడ్డాయని తెలిపారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజర్వేషన్ నియమావళిని అనుసరించి 10వ తరగతి మెరిట్ ఆధా రంగా సీట్లు కేటాయిస్తారన్నారు. జనరల్ సైన్స్, ఇంగ్లీషు, సోషల్ స్టడీస్‌లో ఎక్కువ మార్కులను చూస్తారని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ కాకుండా ఇతర రాష్ట్రాల అభ్యర్థులకు 5 శాతం సూపర్ న్యూమరి సీట్లు అందుబాటులో ఉన్నాయని, అటువంటి అభ్యర్థులకు ట్యూషన్ ఫీజు కింద ఏడాదికి రూ1,50,000 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

కేన్సర్ రోగులకు కేశదానం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కేన్సర్ బాధితుల మోహల్లో చిరునవ్వు చిందించడానికి హెల్పింగ్ మైండ్స్ గొప్ప సంకల్పంతో తలపెట్టిన హెయిర్ డోనేషన్ కార్యక్రమానికి మహిళలు, అమ్మాయిలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి కేశాలు దానం చేస్తున్నారు. మదనపల్లెకు చెందిన జి.కృష్ణమూర్తి కుమార్తె కృష్ణపూజిత హెల్పింగ్ మైండ్స్ కార్యాలయానికి విచ్చేసి స్వచ్ఛందంగా తన కేశాలను దానం చేశారు. ఆమెకు హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకుడు అబూబక్కర్ సిద్దిక్ ప్రశంస పత్రంతో పాటు పూలమొక్క బహుకరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే 28 మంది స్వచ్ఛందంగా ముందుకు వచ్చి కేశాలు దానం చేసారని, రాష్ట్ర వ్యాప్తంగా కేన్సర్ బాధితులకు ఎవరికైనా విగ్గులు కావాలంటే తమ సంస్థ ఉచితంగా పంపిణీ చేస్తుందని పేర్కొన్నారు. పూజిత మాట్లాడుతూ కేన్సర్ బాధితులు కీమోథెరపి సమయంలో జుట్టు రాలి, మనోవేదనకు గురవుతారని వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపాలని కేశాలు దానం చేసినట్లు తెలిపారు. జి.కృష్ణమూర్తి మాట్లాడుతూ మదనపల్లి పట్టణంలో చిన్న ప్రాయం నుండే సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి ఆదర్శంగా నిలుస్తున్న హెల్పింగ్ మైండ్స్ సేవలను అభినందించారు.



కేశాలు దానం చేసున్న పూజిత



ప్రిన్సిపల్, సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్‌టిసి సిబ్బంది

ఆర్‌టిసి యాత్రలపై ఉద్యోగుల ప్రచారం

ప్రజాశక్తి-పీలేరు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజా రవాణా శాఖ చేపట్టిన యాత్రలపై ఆ శాఖ ఉద్యోగులు క్షేత్రస్థాయి ప్రచారానికి సిద్ధమయ్యారు. శుక్రవారం పీలేరు ఆర్టీసీ డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లు కెవి రమణ, జి.ప్రమీల, ఉద్యోగులు సంయుక్తంగా విద్యా సంస్థలు, గ్రామీణ ప్రాంతాల్లోనూ ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీహరికోట నుంచి త్వరలో జరగనున్న చంద్రయాన్ ప్రయోగ ప్రత్యక్ష వీక్షణకు విద్యాసంస్థల నుంచి మంచి స్పందన లభిస్తోందన్నారు. శ్రీ భువన విద్యాలయంలో ప్రిన్సిపల్ గుణలక్ష్మి, సిబ్బందిని కలిసి 9 టికెట్లు బుక్ చేశామని చెప్పారు. ఈ నెల 9న పీలేరు నుండి గోవాకు కూడా టూర్ ఏర్పాటు చేశామని, టికెట్లు కూడా బుక్ చేయడం జరుగుతోందని తెలియజేశారు. 9న సాయంత్రం 4 గంటలకు పీలేరు నుంచి బయలుదేరి, గోకర్ణలో ఒకరోజు, గోవాలో 2 రోజుల పాటు బీచ్‌లు, ఇతర సందర్శనా ప్రాంతాలను చూసుకుని, 12వ తేదీ రాత్రి తిరిగి పీలేరుకు చేరుకోవడం జరుగుతుందన్నారు. గోవాకు రానుపోను బస్ టికెట్ రూ.3200 మాత్రమేనని, ఆసక్తి గల వారు సీట్లు రిజర్వ్ చేసుకోవాలని కోరారు.

మసీదుల అభివృద్ధికి కృషి

- జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ ఎస్.ఎ.కరీముల్లా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మండలంలోని శానిటోరియంలోని మసీదును శుక్రవారం జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ ఎస్.ఎ.కరీముల్లా సందర్శించారు. ఈ సందర్భంగా అయన మసీదు కమిటీ పెద్దలతో సమావేశమై చర్చించారు. మసీదు, ఈద్గా వద్ద ఏదేని సమస్యలు ఉన్నాయా అని ఆరా తీశారు. స్థానిక పెద్దలు, కమిటీ సభ్యుల అభిప్రాయాలను తెలుసు కొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తప్పనిసరిగా కేంద్ర ప్రభుత్వ ఆదేశాలు మేరకు మసీదులను జిల్లా వక్ఫ్ బోర్డు కింద రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. మసీదు కమిటీ సభ్యులలో ఎవరైనా మరణించి వున్నా లేదా ఖాళీగా వున్న వారి స్థానంలో నూతన సభ్యులను నియమించుకోవాలన్నారు. మసీదుల అభివృద్ధికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి సహాయ సహకారాలతోపాటు అవసరమున్నంత మేరకు వక్ఫ్ బోర్డు నిధుల ద్వారా అభివృద్ధి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మసీదు కమిటీ సభ్యులు, స్థానిక మత పెద్దలు, ముస్లిం మైనారిటీ సోదరులు పాల్గొన్నారు.



మసీదు కమిటీ పెద్దలతో సమావేశమైన కరీముల్లా

నాడు-నేడు పనులు వేగవంతం


ప్రజాశక్తి - రాయచోటి

నాడు - నేడు పనులు వందశాతం పూర్తి చేయాలని విద్యాశాఖ అధికారులను కలెక్టర్ గిరీష ఆదేశించారు.శుక్రవారం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ విసి హాల్లో మనబడి నాడు నేడు రెండో దశ పనులు, టాయిలెట్స్, కిచెన్ షెడ్, మేజర్ అండ్ మైనర్ రిపేర్, తదితర పనులు పురోగతిపై హెచ్ఎంలు, ఎంఇఒలు, ఎంపిడిఒలు, ఫీల్డ్ ఇంజినీర్లతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మనబడి నాడు-నేడు పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇంకా పది రోజులు మాత్రమే సమయం ఉందని, త్వరంగా పూర్తి చేయాలని చెప్పారు. ఎలక్ట్రిషన్ మెటీరియల్ అన్ని కొనుగోలు చేసి వచ్చేవారం కల్లా వంద శాతం పనులు పూర్తికావాలన్నారు. సానిటరీ టైల్స్ కూడా మొత్తం కొనుగోలు చేయాలన్నారు. జూనియర్ కళాశాలలో నాడు నేడు పనులకు సంబంధించి అన్ని కొనుగోలు చేసి త్వరగా పనులు పూర్తి చేయాలన్నారు. అంగన్వా డీభవనాలు పునాది స్థాయి నుంచి రూఫ్ లెవెల్ తీసుకురావాలని ఆదేశించారు. సుండుపల్లిలో 22, సంబేపల్లి 17 బేస్మెంట్ లెవెల్‌లో ఉన్నాయని, వచ్చేవారం కల్లా కనీసం పది బిల్డింగులు రూఫ్ లెవెల్‌కి తీసుకురావాలన్నారు. కూలీల సంఖ్యను గణనీయంగా పెంచుకొని నాడు - నేడు పనులను వేగవంతం చేయాలన్నారు. భవనాలన్నీ వంద శాతం రూఫ్ లెవెల్ కి వచ్చేలా మండల అభివృద్ధి అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. టాయిలెట్స్ నిర్మాణంలో ఇంకా 501 ఇన్ ప్రోగ్రెస్‌లో ఉన్నాయన్నారు. మేజర్ అండ్ మైనర్ రిపేర్ పనులన్నీ త్వరగా పూర్తి చేయాలని సూచించారు. సమీక్షలో డిఇఒ పురుషోత్తం, ఐసిడిఎస్ పిడి ధనలక్ష్మి, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఇ ప్రసన్నకుమార్, విఃఎస్‌డబ్ల్యూఎస్ ఎఒ మనోహరాజు పాల్గొన్నారు.

అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పణ

ప్రజాశక్తి-వాల్మీకిపురం

వాల్మీకిపురం గ్రామదేవత శ్రీ నల్లవీర గంగాభవాని అమ్మవారి జాతర మహోత్సవాల సందర్భంగా బ్రాహ్మణ వీధికి చెందిన ఉపాధ్యాయ దంపతులు సురేష్, అరుణకుమారి శుక్రవారం పట్టువస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షులు రమణారెడ్డి చేతులమీదుగా అమ్మవారికి పట్టువస్త్రాలను అందజేశారు. ప్రతి సంవత్సరం అమ్మవారి జాతరకు పట్టు వస్త్రాలను అందజేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు పద్మ, మహేంద్ర, ఆలయ చైర్మెన్ రామ్‌కుమార్‌రెడ్డి, సభ్యులు బలరాం, పూజారి జనార్ధన్, భక్తులు పాల్గొన్నారు.



అమ్మవారికి పట్టువస్త్రాలను అందజేస్తున్న సురేష్ దంపతులు

రెజ్లర్లకు మద్దతుగా పోరాడుదాం : విసికె

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

బంగారు పతకాలను గెలిచి ప్రపంచ వేధికలపై భారతదేశానికి ఎనలేని గౌరవాన్ని సాధించిపెట్టిన బంగారు బిడ్డలు భారత రెజ్లర్లని, అలాంటి వారిపై లైంగిక వేధింపులకు పాల్పడిన భారత రెజ్లర్ల సంఘం చీఫ్ బ్రిజ్ భూషణ్ శరన్ సింగ్‌ను వెంటనే అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని విడుదలై చిరుతైగల్ కట్చి (విసికె పార్టీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిటిఎం శివప్రసాద్ డిమాండ్ చేశారు. తమపై లైంగిక వేధింపులకు పాల్పడిన బ్రిజ్ భూషణ్‌పై కేసులు నమోదు చేసి, కఠినంగా శిక్షించాలని కోరుతూ, ఇన్నిరోజులుగా ఢిల్లీ రోడ్లపై రెజ్లర్లు ఆందోళన చేస్తున్నా, ప్రధాని గాని, ప్రభుత్వం గాని పట్టించుకోక పోవడం దేశానికి సిగ్గుచేటని విమర్శించారు. బ్రిజ్ భూషణ్ ఇప్పుడు ఆరోసారి ఎంపీగా వున్నాడని, అయనకు రెండు చాపర్లు, 60 డిగ్రీ కాలేజీలు, 50 ఇంటర్ కాలేజీలు, ఒక ఫామ్, హెలిప్యాడ్ ఉన్నాయని, వీటితోపాటు అతనిపై 48 క్రిమినల్ కేసులు కూడా ఉన్నాయని, ఒక వ్యక్తిని చంపినట్లు తానే స్వయంగా ఒప్పుకున్నాడని ఆరోపించారు. భారత రెజ్లర్లు ఇచ్చిన ఫిర్యాదుపై ఢిల్లీ పోలీసులు రెండు కేసులు నమోదు చేయడం జరిగిందని, ఈ కేసుల్లో బ్రిజ్ భూషణ్‌ను వెంటనే అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రెజ్లర్ల ఆందోళనకు మద్దతుగా ఉద్యమాలను ఉధృతం చేస్తామని తెలిపారు.

'బాల కార్మిక రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి'



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి-రాయచోటి

అన్నమయ్య జిల్లాను బాల కార్మిక రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అధికారులు కృషి చేయాలని కలెక్టర్ గిరిషా పి.ఎస్ ఆదేశించారు. శుక్రవారం రాయచోటి కలెక్టరేట్ లోని మినీ విసి హాల్లో బాల కార్మికుల జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పిల్లలను కార్మికులుగా మార్చకుండా తల్లితండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. తరచూ తనిఖీలను నిర్వహిస్తూ బాలలను పనిలో పెట్టుకున్న వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈనెల 1 నుంచి 30 వరకు జిల్లాలో బాల కార్మికులను గుర్తించి వారిని రిహాబిటేషన్ చేయుడంతో పాటు బాల కార్మికులను పనిలో పెట్టుకున్న యాజమాన్యాలపై కేసు నమోదు చేయాలని పేర్కొన్నారు. ప్రధానంగా మున్సిపాల్టీ పరిధిలో చిన్న, చిన్న హోటళ్లల్లో బాల కార్మికులు పనచేస్తున్నారో లేదో తనిఖీలు నిర్వహించి రిపోర్టు ఇవ్వాలని కమిషనర్లను ఆదేశించారు. చిన్న, చిన్న ఫ్యాక్టరీలు, గ్రైనెట్స్ తయారీ, ఇటుకుల బట్టీ తయారీలో బాల కార్మికులు ఉంటే వెంటనే సంబంధిత యాజమాన్యం పై కేసులు నమోదు చేయించాలన్నారు. బడి మానేసి పనులకు వెళుతున్న పిల్లలను బడిలో చేర్పించే కార్యక్రమం చేపట్టాలని విద్యా శాఖదికారులను ఆదేశించారు.

కార్మికులకు కనీస వేతనం నిర్ధారించాలి

ప్రభుత్వ శాఖలలో పనిచేసే ఎన్ఎంఆర్, మజ్దూర్ కార్మికులకు కనీస వేతనం నిర్ధారించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. గ్రామీణ ప్రాంతలో ప్రభుత్వ శాఖలలో పనిచేసే కార్మికులకు, నైపుణ్యం కల్గిన కార్మికలకు రూ. 570, సెమీ స్కిల్డ్ రూ. 499, మున్సిపాల్టీ పరిధిలోని ఎన్ఎంఆర్, మజ్దూర్ కార్మికులకు రూ. 605, సెమీ స్కిల్డ్‌కు రూ. 562, అన్‌స్కిల్డ్‌కు రూ. 522 కనీస వేతనం వచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా లేబర్ డిపార్ట్‌మెంట్ ఇన్‌ఛార్జి అధికారి డి.వి. రంగరాజు, ఇరిగేషణ్ ఎస్ఇ కృష్ణమూర్తి, ఎపిఎస్‌పిడిసిఎల్ ఎస్ఇ చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ ప్రసన్నకుమార్, డిఆర్‌డిఎ పీడీ సత్యనారాయణ, డిపిఒ ధనలక్ష్మి, జిల్లా అగ్రికల్చర్ అధికారి ఉమామహేశ్వరమ్మ, కమిషనర్లు, అధికారులు పాల్గొన్నారు.



ధాన్యం గోడౌన్‌కు భూమిపూజ చేస్తున్న ఎంపిపి

రైతులందరికీ ఉపయోగపడేలా నిర్మాణం

ప్రజాశక్తి-వీరబల్లి

రైతులందరికీ ఉపయోగ పడేలా గోడౌన్ నిర్మాణం ఉండాలని మండలపరిషత్ అధ్యక్షులు గాలివీటి రాజేంద్రనాథ్‌రెడ్డి కోరారు. మండల రైతు ఉత్పత్తి దారుల సమాఖ్య ఆధ్వర్యంలో చేపట్టే గోడౌన్ నిర్మాణానికి ఆయన శుక్రవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో రైతులు పండించే పంటలను భద్రపరుచుకోవడానికి గోడౌన్ ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. డిఆర్‌డిఎ పీడీ సుబ్బరామయ్య భవిష్యత్‌లో రైతులకు కావలసిన వ్యవసాయ పరికరాలు అందుబాటులోకి తెస్తామన్నారు. రూ.15 లక్షల నిధులతో త్వరలోనే నిర్మాణం పూర్తి చేస్తామని,75 శాతం ఉద్యానశాఖ సబ్సిడీతో పూర్తి అవుతుందన్నారు. కార్యక్రమంలో మండల వైసిపి నాయకులు వీరనారెడ్డి, వి. పిఆర్‌డి సురేష్ బాబు, ఎపిఎం ఖాదర్ వలి, మండల రైతు ఉత్పత్తి దారుల సమాఖ్య అధ్యక్షులు సుబ్బరామరాజు, సమాఖ్య సిబ్బంది వెంకటలక్ష్మి, శంకర్, కల్యాణ్, రైతు మిత్రలు, జనమేజయుడు, వెంకటేష్, రైతు ఉత్పత్తి దారుల సమాఖ్య బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

నేడు వైసిపి సోషల్ మీడియా ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

జిల్లా పరిధిలోని తంబళ్లపల్లి, మదనపల్లి, పీలేరు, రాయచోటి నియోజకవర్గాల వైసిపి సోషల్ మీడియా ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు సోషల్ మీడియా సభ్యులు ద్వారకానాథ్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ సమావేశానికి రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి అధ్యక్షతన జరుగుతుందని తెలిపారు. జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు నవాజ్‌బాషా, చింతల రామచంద్రారెడ్డి హాజరవుతారని చెప్పారు. స్థానిక అంగళ్లు నందు నియోజకవర్గం మండల సోషల్ మీడియా కన్వీనర్లు ,కో-కన్వీనర్లు కార్యకర్తలతో ముఖాముఖిగా సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశంలో వైసిపి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, భవిష్యత్తులో చేయాల్సిన కార్యక్రమాలపై చర్చించనున్నట్లు వారు తెలిపారు. నాలుగు నియోజకవర్గాల్లోని సోషల్ మీడియా ప్రతినిధులు ఈ సమావేశానికి పెద్దఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని టీమ్ ద్వారకనాథ రెడ్డి సోషల్ మీడియా సభ్యులు రామిగాని శంకర్, అజారుద్దీన్ వెంకటేశ్వర రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, తస్లీర్, కిరణ్ కోరారు.

గాలివానకు కూలిన ట్రాన్స్‌ఫార్మర్

- పట్టని అధికారులు

ప్రజాశక్తి-సుండుపల్లి



గాలివానకు కూలిన ట్రాన్స్‌ఫార్మర్

మండలంలోని మడితాడు గ్రామ పంచాయతీలో బయనేని దళితవాడలో సమీపంలోనివంచందని ఒడ్డుపైన స్తంభాలు విరిగి ట్రాన్స్‌ఫార్మర్ కిందపడిపోయిందని, పట్టించుకునే అధికారులే లేరని ఆ గ్రామస్తులు కె.వి.రమణయ్య, డాక్టర్ మల్లికార్జునస్వాములు పేర్కొన్నారు. గాలివాన వచ్చి దాదాపు నాలుగు రోజులవుతున్నా కూడా వెంట పడిన ట్రాన్స్‌ఫార్మర్‌ను పట్టించుకునే నాథుడే లేరన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ కిందపడిపోవడంతో అక్కడ ఉన్న వైర్లకు విద్యుత్ సరఫరా అవుతుందని స్థానిక ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఆ దారి నుంచి వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. పక్కనున్నటువంటి వ్యవసాయ భూమి గుండా వెళ్లాలంటే సంబంధిత రైతు అభ్యంతరం చెబుతున్నారని అన్నారు. ఈ విషయాన్ని సంబంధిత లైన్‌మెన్‌కు కూడా తెలిపినా పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అక్కడున్నటువంటి ట్రాన్స్‌ఫార్మర్‌ను వెంటనే తొలగించి, ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేయించి సక్రమంగా విద్యుత్ సరఫరా అయ్యేటట్లు చూడాలని కోరుతున్నారు.



షోరూమ్ ప్రారంభిస్తున్న జగన్మోహన్‌రాజు

శామ్‌సంగ్ షోరూమ్ ప్రారంభం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఆర్ఎస్ రోడ్డులోని తిరుపతికి చెందిన మెగా డిస్ట్రిబ్యూటర్ మోహన్‌రాజు, తాళ్లపాకకు చెందిన టిడిపి సీనియర్ నాయకులు అంజన్ రాజుల శామ్‌సంగ్ ఎంటర్ప్రైజెస్ షోరూమ్‌ను శుక్రవారం టిడిపి సీనియర్ నాయకులు చమర్తి జగన్‌మోహన్ రాజు చేతుల మీదుగా పారంభించారు. కార్యక్రమంలో ఆయన వెంట మండల టిడిపి నాయకులు జివి.సుబ్బరాజు, శేషారెడ్డి, టిఎన్ఎస్ఎఫ్ పార్లమెంటు అధ్యక్షులు పోలిశివకుమార్, సూర్య నారాయణ రాజు, గురునాయుడు, వెంకటేష్‌యాదవ్, వినోద్‌రెడ్డి పాల్గొన్నారు.



నియోజకవర్గ పరిశీలకుల సమావేశానికి హాజరైన పర్వీన్ తాజ్

'టిడిపి విజయానికి కృషి చేయాలి'

బి.కొత్తకోట : టిడిపి జాతీయ కార్యాలయంలో రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల టిడిపి పరిశీలకులతో శుక్రవారం ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు సమావేశమయ్యారు. ఎపి టిడిపి అధ్యక్షులు అచ్చెన్నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి సూళ్లురుపేట నియోజ కవర్గం పరిశీలకులు, టిడిపి రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి ఎస్.ఎం.ఫర్వీన్ తాజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చంద్రబాబు పరిశీలకులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారన్నారు. వచ్చే శాసనసభ ఎన్నికల్లో పార్టీ గెలుపునకు శాయశక్తులా కృషి చేయాలని ఆదేశాలు జారీ చేశార న్నారు. తనకు సూళ్లురుపేట నియోజకవర్గం పరిశీలకులుగా బాధ్యతలు అప్పగించారన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించి, పార్టీని బలోపేతం చేయడం జరిగిందన్నారు. వచ్చే శాసనసభ ఎన్నికల్లో సూళ్లూరుపేట నియోజకవర్గంలో టిడిపిని అఖండ మెజారిటీతో గెలిపించి అధినేతకు కానుకగా ఇస్తామన్నారు. వైసిపి ఎన్ని కుయుక్తులు పన్నినా టిడిపి ప్రభంజనాన్ని ఆపలేరని అన్నారు.

ఐటిఐ నూతన టిఒగా నాగరాజు

ప్రజాశక్తి-తంబళ్లపల్లె

తంబళ్లపల్లె ప్రభుత్వ ఐటిఐ నూతన టిఒ (ట్రైనింగ్ ఆఫీసర్)గా నాగరాజు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ టిఒగా పనిచేస్తున్న శ్రీనివాసులురెడ్డి పుంగనూరుకు బదిలీ కావడంతో అదే ఐటిఐ లో పనిచేస్తున్న నాగరాజు బదిలీపై తంబళ్లపల్లెకు వచ్చారు. ఈ సందర్భంగా నూతన టిఒ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన శిక్షణ బోధన అందించడంతోపాటు ఐటిఐ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఆయన సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

రైతులు సహకరిస్తే శాశ్వత పరిష్కారం : ఆర్‌డిఒ

ప్రజాశక్తి-కలికిరి

భూ రీసర్వేకు రైతులు సహకరిస్తేనే భూ సమస్యలపై శాశ్వత పరిష్కారం దొరుకుతుందని ఆర్‌డిఒ మురళి తెలిపారు. స్థానిక మండల కేంద్రంలోని కలికిరి, పత్తేగడ పంచాయతీలోని కొర్లగుంట గ్రామాలలో జరుగుతున్న రీసర్వే కార్యక్రమాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ డ్రోన్ సహాయంతో జరుగుతున్న రీ సర్వే సమయంలో సంబంధిత రైతులు తమ పాస్ బుక్కులు, దస్తావేజులు గాని చూపించి తమకు ఉన్నటువంటి సమస్యలను అధికారుల ద్వారా పరిష్కరించుకోవాలని తెలిపారు. చిన్న చిన్న తగాదాలు, బాగ పరిష్కారాలు, తదితర సున్నితమైన సమస్యలు, లేకుండా అధికారులకు రైతుల సహకరించి ఈ సర్వేకి సహాయ సహకారాలు అందిస్తేనే భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అన్నారు. అనంతరం కలికిరి తహశీల్దార్ కార్యాలయంలో జగనన్న కాలనీల పురోగతిపై సమీక్షించారు. జగనన్న లే అవుట్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని హౌసింగ్ ఎఇకి సూచించారు.



రీసర్వే కార్యక్రమంలో రైతులతో మాట్లాడుతున్న ఆర్‌డిఒ మురళి

ప్రజలకు రేషన్ పంపిణి సక్రమంగా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని తాసిల్దారు భాగ్యలతకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ భాగ్యలత, మండల సర్వేయర్ దేవి, హౌసింగ్ ఎఇ పాల్గొన్నారు.

పశువుల బీమాను సద్వినియోగం చేసుకోండి



పశు వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ రమణయ్య

ప్రజాశక్తి-కలికిరి

పశువులకు భీమా సౌకర్యాన్ని సద్వినిగం చేసుకోండని స్మైల్ విశాఖపట్నం సహాయ సంచాలకులు డాక్టర్ రమణయ్య తెలిపారు. స్థానిక మండలంలోని మునేళ్లపల్లి గ్రామపంచాయతీ నందు పశువైద్య శిబిరంలో భాగంగా పశువిజ్ఞానబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు పిడుదుల నివారణ, మందులు పిచికారి, దూడలకు నట్టల నివారణ మందు పంపిణీ, గర్భకోశ వ్యాధులపై ఆరోగ్య వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమణయ్య రైతులతో మాట్లాడుతూ ప్రభుత్వం పశుసంవర్ధక శాఖ ద్వారా నూతనంగా ప్రవేశపెడుతున్న వైఎస్ఆర్ బీమా గురించి రైతులకు వివరించారు. రూ.30వేలు బీమాకు గాను బిపిఎల్ ఎస్‌సి, ఎస్‌టి రైతులకు మూడు సంవత్సరాలకు మొత్తం రూ.384, ఎపిఎల్ రైతులకు రూ.960లు కడితే చాలన్నారు. గొర్రెలు, మేకలు, పందులకు, ఒక్కొక్కటికీ మూడు సంవత్సరాలకు గాను రూ.75 రూపాయలు చొప్పున చెల్లిస్తే సరిపోతుందని చెప్పారు. ఇది కాకుండా గడ్డి కత్తిరించే యంత్రాలు ఉపయోగాలు గురించి రైతులకు వివరించారు. అనంతరం డాక్టర్ గిరిధర్‌రెడ్డి రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ ఆవులలో పోదుగువాపు వల్ల కలిగే నష్టాలు వాటి నివారణ చర్యలు గురించి రైతులకు వివరించారు. ఈ సందర్భంగా ఆదర్శ రైతు అక్బర్‌అహ్మద్ మాట్లాడుతూ తను సాగు చేస్తున్నటువంటి గడ్డి రకాలు వాటి వల్ల ఉపయోగాలు పై పశు రైతులతో పంచుకున్నారు. కార్యక్రమంలో పశువైద్య సహాయకులు వాసుదేవరెడ్డి, రాజనమ్మ, రాజకుమార్ పాల్గొన్నారు.

ఒకటో తేదీనే జీతాలు చెల్లించేలా చట్టం చేయాలి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

ప్రజాస్వామ్య పద్ధతిలో ఎపిజిఇఎ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన దశల వారి రిలే నిరాహార దీక్షలలో భాగంగా శుక్రవారం తంబళ్లపల్లి తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఎపిజిఇఎ తాలుకా కార్యవర్గ సభ్యులులతో నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై.శ్రీనివాసులురెడ్డి, గురుప్రసాద్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎపిజిఎ రాష్ట్రకార్యవర్గం ఇచ్చిన పిలుపుమేరకు రాష్ట్రంలో గల అన్ని జిల్లాలలో ప్రతి తాలూకా కేంద్రంలో ప్రభుత్వ ఉద్యోగులు, ఉద్యోగ ఉపాధ్యాయ, కాంట్రాక్టు, కార్మిక,పెన్షనర్ల, సిపిఎస్ ఉద్యోగులు, గ్రామ వార్డు సచివాలయ అన్ని సంఘాల మద్దతుతో ఉద్యోగులందరూ కలిసి రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నారని అన్నారు. ఉద్యోగులకు రావాల్సిన ఆర్థిక బకాయిలు, అనేక సమస్యలు, సిపిఎస్ రద్దు , ప్రతి నెల ఒకటో తేదీని జీతభత్యాలు చెల్లించేలా చట్టం చేయాలని అన్నారు. కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్ , డిఎ బకాయిలు, జిపిఎఫ్, ఎపి జిఎల్ఐ సొమ్ములకు భద్రత, తొమ్మిది ప్రధాన డిమాండ్లతో సుమారు 200 డిమాండ్లు నెరవేర్చుట కోసం ప్రభుత్వానికి గత నాలుగు సంవత్సరాలలో అనేక నివేదికలు సమర్పించామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు



రిలేదీక్షలో పాల్గొన్న ఎపిజిఇఎ ఉద్యోగులు

రమణారెడ్డి, ఎపిజిఇఎ ట్రెజరర్, సుధాకర్‌రాజు, విశ్రాంత ఉద్యోగుల అధ్యక్షుడు రాజా, కాంట్రాక్టు ఉద్యోగులు, వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు, మహిళా శిశుసంక్షేమ శాఖ ఉద్యోగులు, రెవెన్యూశాఖ ఉద్యో గులు, ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి ఉద్యోగులు, ఆర్అండ్‌బి శాఖ ఉద్యో గులు, గ్రామ వార్డు సచివాలయ, జిల్లా ఖజానా శాఖ ఉద్యోగులు. విఆర్ ఒలు పాల్గొన్నారు.



నూతనంగా ఏర్పాటు చేసిన తాగునీటి మోటర్


రామిగానిపల్లెకు తాగునీటి సౌకర్యం

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండల పరిధిలోని పరసతోపు పంచాయతీలోని రామిగానిపల్లెలో తాగునీటి సమస్యకు ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి పరిష్కారం చూపించారు. గత కొన్ని రోజులుగా తాగునీటి సమస్యతో గ్రామ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు సమస్యను స్థానిక నాయకులు మాజీ సర్పంచ్ పార్వతమ్మ, శ్రీనివాసులు తో కలిసి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే సమస్యను తక్షణమే స్పందించి బోరు త్రవ్వించి, కొత్త మోటారు, పైపులు ఏర్పాటు చేయించారు. అనతి కాలంలోనే తాగునీటి సమస్యకు పరిష్కారం చేసిన ఎమ్మెల్యే గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

చెరువుల దగ్గరికి ఈతకు వెళ్లరాదు : ఎస్ఐ

ప్రజాశక్తి-పుల్లంపేట



ఎస్ఐ రఘురాం

మండల పరిధిలోని యువత వేసవి సెలవుల్లో భాగంగా కుంటలు, చెరువుల దగ్గరకు వెళ్లి ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దని స్థానిక ఎస్ఐ రఘురాం తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ స్విమ్మింగ్ పూల్‌కి వెళితే మంచిదని, నేటి యువత అధిక వేగం కారణంగా రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారని, వాహనదారులు సీటు బెల్ట్, హెల్మెట్ తప్పక ధరించాలని తెలిపారు. మద్యం తాగి వాహనాలను నడిపితే వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. మండల పరిధిలో అసాంఘిక కార్య క్రమాలపై ఉక్కు పాదం మోపడం జరుగుతుందన్నారు.. వేసవి సెలవులలో ఇండ్లకు తాళాలు వేసి ఊర్లకు వెళ్లేవారు పోలీసులకు ముందస్తు సమాచారం అందిస్తే తగిన నిఘా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. రాత్రి సమయాలలో ఇళ్ల వద్ద ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే 100 నెంబర్‌కు డయల్ చేయాలని దొంగతనాలను, అరికట్టేందుకు ప్రకటనల ద్వారా మైక్ ప్రకటనల ద్వారా, కరపత్రాలు పంచడం లాంటివి నిర్వహిస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకొస్తున్నామని తెలిపారు. ఊర్లకు వెళ్లేవారు తమ బంగారంను బ్యాంక్ లాకర్ల లో భద్రపరుచుకోవాలని తెలిపారు.



సర్వేలో మార్క్ చేస్తున్న రెవెన్యూ అధికారులు

రోడ్డు విస్తరణ పనులకు సర్వే

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని పుల్లంగేరు బ్రిడ్జి నుంచి కడప చెన్నై హైవే రోడ్డు వరకు రోడ్డు విస్తరణ పనులకు సంబంధించి ఆర్అండ్‌బి ఇఇ ఆదేశాల మేరకు తహశీల్దార్ నరసింహ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం సర్వే చేపట్టారు. రోడ్డు కి ఇరువైపులా ఉన్న 23 భవనాలకు సంబంధించి 1905 ప్రకారం ఆక్రమణకు గురైన భవనాలకు సంబంధించి యజమానులకు 7 నోటీస్ ఇవ్వడం జరిగిందని తహశీల్దార్ తెలిపారు. యజమానులు వారి ఇంటి దగ్గర యజమానులే ఇళ్లను పగలగొట్టుకుంటే సరిపోతుందని, అలా లేనియెడల జెసిబి లతో తామే మార్క్ ఇచ్చినంత వరకు పడగొడతామని తెలిపారు. సంబంధిత భవనాల యజమానులు రెవిన్యూ శాఖకు ఆర్అండ్‌బి శాఖకు సహకరించాలని కోరారు.

విలేజ్ క్లినిక్‌ల పూర్తికి చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో చేపట్టిన డాక్టర్ వైఎస్ఆర్ గ్రామీణ ఆరోగ్య కేంద్రాల (విలేజ్ హెల్త్ క్లినిక్స్)ను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ గిరీష పంచాయతీరాజ్ శాఖ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి జిల్లాలో చేపట్టిన వైఎస్ఆర్ గ్రామీణ ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణాల ప్రగతిపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైద్య సేవలను ప్రజలకు చేరువ చేసేందుకు ప్రతి గ్రామంలోనూ రాష్ట్ర ప్రభుత్వం డాక్టర్ వైఎస్ఆర్ గ్రామీణ ఆరోగ్య కేంద్ర భవన (విలేజ్ హెల్త్ క్లినిక్స్) నిర్మాణాలను ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. జిల్లాలో ఒక్కొక్క ఆరోగ్య కేంద్రం రూ.17.50 లక్షల ఖర్చుతో మొత్తం 303 గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు మంజూరు కాగా, ఇప్పటివరకు 112 పూర్తయ్యాయని తెలిపారు. వీటిలో 61 ఆరోగ్య కేంద్రాలను వైద్య ఆరోగ్య శాఖకు అప్పగించారని, మిగిలిన 51 ఆరోగ్య కేంద్రాలను నిబంధనలను పాటించి ఈ నెల 20 లోపు వైద్య ఆరోగ్య శాఖకు స్వాధీనం చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఇంకను పూర్తి కావాల్సి ఉన్న 113 ఆరోగ్య కేంద్రాల పురోగతి, అవి ఏయే దశల్లో ఉన్నవి, చేపట్టిన పనులు ఎంతవరకు పూర్తి చేశారు, సిమెంటు సమస్యలు ఏమైనా ఉన్నాయా తదితర అంశాలపై మండలాల వారీగా పిఆర్ ఇంజినీరింగ్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. భవనాలను త్వరితగతిన పూర్తి చేయడానికి ఒక్కొక్క ఆరోగ్య కేంద్రానికి ప్రభుత్వం మొదట్లో మంజూరు చేసిన రూ.17.50 లక్షలకు అదనంగా మరొక రూ.3.30లక్షలు కేటాయించిందని, సదరు నిధులు సిద్ధంగా ఉన్నాయన్నారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా చేపట్టిన గ్రామ సచివాలయాలు, ఆర్‌బికెలకు సంబంధించి ఎక్కడైనా 15వ ఆర్థిక సంఘం నిధులు ఉంటే ప్రతిపాదనలు సమర్పిస్తే వెంటనే మంజూరు ఉత్తర్వులు జారీ చేస్తామన్నారు. జిల్లాలో చేపట్టిన వైఎస్ఆర్ గ్రామీణ ఆరోగ్య కేంద్రాలను త్వరితగతిన పూర్తి చేసి జిల్లా అభివృద్ధికి పాటుపడాలని కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో పంచాయతీరాజ్ ఎస్ఇ కెజెఎస్ చంద్రారెడ్డి, డిఇలు, ఎఇలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

మదనపల్లె అర్బన్ : ప్రజా సమస్యలు పరిష్కరించాలని జనసేన నాయకులు డాక్టర్ మైఫోర్స్ మహేష్ అధికారులను కోరారు. శుక్రవారం మండలంలోని బికేపల్లిలో ఇంటింటికీ పాదయాత్రగా వెళ్లి ప్రజల సమస్యలు, వాళ్ల బాగోగులు తెలుసు కుంటున్నారు. ప్రజలు కనీస మౌలిక సదుపాయాలైన తాగునీరు, రోడ్లు, కాలువలు వంటి సమస్యలు చెప్పారని పేర్కొన్నారు. పాలకపక్షం సమస్యల పరిష్కారం, మౌలిక సదుపాయాల కల్పనపై పట్టించుకోలేదన్నారు. 2004లో ఏర్పడిన ఈ కాలనీకి ఇప్పటి వరకు తాగునీరు, రోడ్లు లేకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వమే మంజూరు చేసిన ఇండ్లకు కూడా మౌలిక సదుపాయాలు కల్పించాక పోవడం ఎంతవరకు సమంజసమని పేర్కొన్నారు. స్థానిక సమస్యలను కలెక్టర్, ప్రభుత్వ యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారం చేసే వరకు పోరాడుతామని పేర్కొన్నారు.

వాల్మీకుల మేలుకొలుపు సభకు తరలిరండి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణంలో ఈ నెల 27న నిర్వహించి తలపెట్టిన వాల్మీకుల మేలుకొలుపు సభకు తరలిరావాలని వాల్మీకి నాయకులు పొదల నరసింహులు పేర్కొన్నారు.శుక్రవారం పలమనేరు నియోజకవర్గం, పత్తికొండ గ్రామం నేషనల్ హైవే ప్రక్కన వాల్మీకి విగ్రహ ప్రతిష్ట ఆహ్వానం మేరకు విచ్చేసిన వాల్మీకి పెద్దలకు ఆహ్వాన పత్రికలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ సభకు వాల్మీకులు అంతా భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో విఆర్ఎస్ఎస్ నాయకులు సీనియర్ న్యాయవాది ఎల్.భాస్కర్, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు అద్దాల నాగరాజ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంపల గంగరాజు, రాష్ట్ర కోశాధికారి మేకల విజయ్ మోహన్, అన్నమయ్య జిల్లా అధ్యక్షులు పూలకుంట్ల హరిబాబు, మరపల్లె వెంకటరమణ, పత్తికొండ గౌరవ అధ్యక్షులు శేషప్ప నాయుడు పాల్గొన్నారు.



బాధితులకు ఆర్థిక సాయం అందిస్తున్న తహశీల్దార్

నష్టపోయిన బాధితులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-సుండుపల్లె

మండలంలోని వర్షానికి నష్టపోయిన బాధిత కుటుంబాలకు తహశీల్దార్ మహబూబ్‌చాంద్ శుక్రవారం ఆర్థిక సాయం అందించారు. ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి ఇటీవల వర్షంతో నష్టపోయిన కుటుంబాలను పరామర్శించారు. నష్టపోయిన కుటుంబాలకు ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం ద్వారా మంజూరు చేయాలని తహశీల్దార్‌ను ఆదేశించారు. తహశీల్దార్ వెంటనే ఆయా కుటుంబాలకు వెళ్లి ఆర్థిక సాయాన్ని అందించారు. గాలివాన, ఈదురు గాలులకు ఇంటి పైకప్పులు పూర్తిగా లేచిపోయి, ఎంతోమంది రోడ్డున పడ్డారు. అగ్రహారం గుట్టలో వేసుకున్న గుడిసెలు పూర్తిగా కొట్టుకొని పోవడంతో చాలా ఇబ్బందులు పడ్డారు. వారికి కూడా ఆర్థిక సహాయాన్ని అందించినట్లు ఆమె తెలిపారు. గుల్లమాలపల్లిలో కూడా నష్టపోయిన ఒక్కొక్క కుటుంబానికి రూ.10వేలు చొప్పున అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రామ చంద్ర, రాయవరం సర్పంచ్ ముడుంపా, మాజీ సర్పంచ్ రామస్వామిరెడ్డి, వైసిపి నాయకులు భానుప్రకాష్‌రెడ్డి, జెసిఎస్ మండల కన్వీనర్ పి.రహిమాన్ఖాన్ విఆర్ఒలు, విఆర్ఎలు పాల్గొన్నారు.

రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

ప్రజాశక్తి-సుండుపల్లి



రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన కంపచెట్లు

మండలంలోని జికె రాచపల్లి నుంచి భయనేని దళితవాడకు వెళ్లే రోడ్డులో ఇరుపక్కల కంపచెట్ల ఏపుగా పెరగడంతో ఆదారిన వెళ్ళాలంటే ఇబ్బందులు పడుతున్నామని ఆగ్రామస్తులు కె.వి.రమణయ్య, రిటైర్డ్‌వార్డెన్ నాగన్న తెలిపారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ ప్రతినిత్యం సుండుపల్లి, జికెరాచపల్లికి ఈ దారి నుంచే వెళ్ళాలని అన్నారు. భయనేని దళితవాడ, శుద్ధగడ్డరాశిపల్లి, కురవపల్లి, బాల్‌రెడ్డిగారిపల్లి, నాగరాజుపల్లి, చంద్రాజుగారిపల్లి, ఎరు కలబెడారుకు చెందిన గ్రామస్తులు కూడా ప్రతిరోజూ ఈ రోడ్డు గుండానే రాక పోకలు సాగిస్తుంటారు. రాత్రి వేళల్లో ఈదారి గుండా వెళ్లాంటే కష్టంగా ఉందని భయాందోళన చెందుతున్నారు. ఈ విష యాన్ని స్థానిక ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి స్పందన లేదని ఆవేదన చెందు తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి, రోడ్డుకు ఇరుపై కల ఉన్న కంప చెట్లను తొలగించి, రోడ్డుకు మరమ్మతులు చేస్తే బాగుంటుందని గ్రామస్తులు కోరుతున్నారు.



ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో మాట్లాడుతున్న డిఇ బాలనరసింహులు

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

ప్రజాశక్తి- రైల్వేకోడూరు

రైల్వే కోడూరు పంచాయతీరాజ్ సబ్‌డివిజన్ పరిధిలో జరుగుతున్న ప్రభుత్వ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని పంచాయతీరాజ్ డిఇ బాల నరసింహులు అన్నారు. శుక్రవారం డిఇ కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన జగనన్న పక్క గృహాల నిర్మాణం పనులు, పంచాయతీరాజ్‌శాఖలో జరుగుతున్న ఇతర అభివృద్ధి పనులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆయన అన్నారు. ఇంటి నిర్మాణాలను చేపట్టని లబ్దిదారులతో చర్చించి త్వరితగతిన నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గృహ నిర్మాణాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. లబ్దిదారులకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎఇ ఆంజనేయ ప్రసాద్, ఎస్ఎం బాషా, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఒంటరితనంతో వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-ములకలచెరువు

మండల పరిధిలోని చౌడసముద్రం గ్రామానికి చెందిన పుట్ట రమణప్ప గుప్తా(56) గురువారం రాత్రి నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్య ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన స్థానికులు అతనిని వెంటనే తంబళ్లపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించి పరిస్థితి విషమించడంతో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.అప్పటికే మృతి చెందినట్లు ఆస్పత్రి సిబ్బంది నిర్ధారించారు. వివరాల్లోకెళ్తే.. మృతుడు పుట్టా రమణప్ప గుప్తకు భార్య,కుమారుడు,కుమార్తె తో ఉంటూ స్థానికంగా హార్డ్వేర్ షాప్ నిర్వహిస్తుంటాడు. ఇటీవల కొంతకాలంగా భార్య పుట్ట సుజాత ఆమె తల్లి అనారోగ్య కారణంతో వారి తల్లి వద్ద ఉంటుందని, పిల్లలు ఉద్యోగరీత్యా హైదరాబాదులో ఉంటున్నారని, భార్య పిల్లలు దూరమై ఒంటరితనం భరించలేక నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడు భార్య సుజాత ఫిర్యాదులో పేర్కొన్నారు. మృతుడు భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ మధు రామచంద్రుడు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి-రామాపురం



మృతి చెందిన అశోక్‌కుమార్

చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారి 40 మండల పరిధిలోని చిట్లూరు గ్రామపంచాయతీ పాలన్నగారిపల్లె సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో నడుపుతున్న భీమారపు అశోక్‌కుమార్(29) అక్కడికక్కడే మృతి చెందినట్లు రామాపురం పోలీసులు తెలిపారు. పోలీసులు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కడప నుంచి రాయచోటి వైపు వెళ్తున్న మినీ లారీ ఎదురుగా వస్తున్న ఆటో ను ఢీ కొనడంతో ఆటో బోల్తా పడడంతో మండలంలోని చిట్లూరు గ్రామం మాలపల్లికి చెందిన ఆటో డ్రైవర్ అశోక్ కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటోలో ప్రయాణిస్తున్న బాలిపోగు శ్రీరాములుకు కాలు విరిగి చికిత్స నిమిత్తం రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలి పారు. చిట్లూరు గ్రామం మాలపల్లికి చెందిన బీమారపు అశోక్ కుమార్(29) జీవనోపాధికై తన సొంత ఆటో రాయచోటిలో బాడుగకు సిమెంట్ తోలుతూ సాయంత్రానికి ఇంటికి చేరుకునేవారు. రోజు మాదిరే శుక్రవారం రాయచోటిలో తన పని ముగించుకొని తిరిగి వస్తుండగా చిట్లూరు సమీపంలో పరుపుల ఫ్యాక్టరీ వద్దకు రాగానే ప్రమాదం జరిగింది మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు గాయపడిన వ్యక్తిని 108 వాహనంలో ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రామాపురం ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు.